క్లుప్తంగా

రేపు షబ్-యే-బరాత్

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ రాకను తెలియజేస్తూ ముస్లిం సమాజం అత్యంత పవిత్రంగా నిర్వహించుకునే షబ్-యే-బరాత్ పర్వదినాన్ని గురువారం నిర్వహించుకోవాలని మత గురువులు సూచించారు. ఈ పవిత్రమైన రాత్రి సందర్భంగా ముస్లింలు రాత్రంతా జాగారం చేస్తూ ప్రత్యేక ప్రార్థనలతో అల్లాహ్‌ను ఆరాధిస్తారు. మహిళలు తమ ఇళ్లల్లో ప్రార్థనలు నిర్వహిస్తారు. ప్రత్యేక ప్రార్థనల నిర్వహణకు ఇప్పటికే మసీదు కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. రాత్రి 10 గంటల నుంచి గురువుల ఆధ్యాత్మిక ప్రసంగాలతోపాటు పవిత్ర రాత్రి ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రసంగాలు కొనసాగనున్నాయి.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు

కడప కార్పొరేషన్: కడప నగరంలో రెండో గాంధీ బొమ్మ నుంచి అల్మాస్‌పేట వరకూ రోడ్లు, కాలువలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. మంగళవారం ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఈ ఆక్రమణలను తొలగించారు. ఫుట్‌పాత్‌లపై ఉన్న బంకులు, ఇతర సామాగ్రిని తీసేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లు, కాలువలపై ఎలాంటి ఆక్రమణలు చేపట్టకూడదన్నారు. ట్రాఫిక్‌ను మెరుగుపరచడంలో ప్రజల సహకారం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం



హెడ్‌కానిస్టేబుల్ సతీమణికి చెక్కు ఇస్తున్న జిల్లా అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు

కడప అర్బన్: జిల్లాలోని రాజుపాళెం పోలీస్‌స్టేషన్‌లో విధులను నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఏ. వెంకటసుబ్బయ్య కుటుంబానికి జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) కె. ప్రకాష్‌బాబు పోలీసు వితరణ నిధి నుంచి రూ. 2.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందచేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హెడ్‌కానిస్టేబుల్ సతీమణి ఏ. రాజేశ్వరికి అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్‌బాబు చెక్కు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, బి.సెక్షన్ సూపరింటెండంట్ బి. శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

13 నుంచి శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి

కడప రూరల్: ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు అనంతపురం జిల్లా గుత్తి వద్ద గల సేవాఘడ్‌లో వెలసిన బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ శివానాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే గాక కర్నాటక, మహారాష్ట్రల నుంచి లక్షలాదిగా బంజారాలు పాల్గొంటారని తెలిపారు. అలాగే ఈ నెల 15 న కడప నగరంలోని గిరిజన భవన్‌లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మూర్తి నాయక్, కార్యదర్శులు వెంకటస్వామి నాయక్, అర్జున్ నాయక్, నాగరాజు నాయక్, మల్లె నాయక్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో నులిపురుగుల నివారణ

కడప ఎడ్యుకేషన్: జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినం సందర్భంగా యోగివేమన విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం యూనిట్ -9 ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శివాజీ నగర్ అంగన్వాడీ కేంద్రంలో నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైవీయూ జాతీయ సేవా పథకం యూనిట్ -9 కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించక పోతే నులి పురుగులు శరీరంలోకి ప్రవేశించి ఎదుగుదలను అడ్డుకుంటాయన్నారు. కార్యక్రమంలో , డా. క్రిష్ణయ్య, వాలంటీర్స్ పాల్గొన్నారు.

ఆహార నిల్వలను పునఃప్రారంభించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: సీడబ్ల్యూసీ గోడౌన్ లో బియ్యం, పసుపు, ఆహార నిల్వలను పునఃప్రారంభించాలి ఏపీ సీడబ్ల్యూసీ గోడౌన్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సి. సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి అన్నారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా కార్యాలయంలో సహాయ పౌర సమాచార అసిస్టెంట్ గ్రేడ్ వన్ అధికారి టీ.వాణికి ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం సమర్పించారు.

పోటెత్తిన భక్తజనం

లూర్దుమాత తిరునాల మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పలువురు క్రైస్తవ గురువులు, విశ్వాసులు పాల్గొన్నారు. తిరునాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆటపాటలతో ఆ ఆవరణం సందడిగా మారింది.

– కడప కల్చరల్



దివ్య సందేశం అందజేస్తున్న బిషప్ గాలి బాలి



లూర్దుమాత తిరునాలలో భక్తుల సందడి



స్తుతి గీతాలను ఆలపిస్తున్న గాయక బృందం



ప్రార్థనల్లో పాల్గొన్న విదేశీయులు



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభచాటిన విద్యార్థులు



జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులతో నారాయణ విద్యా సంస్థల ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్ లో కడప నారాయణ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇందులో అబ్దుల్ హసీమ్ 99.91 శాతం, నితీష్‌రెడ్డి 99.90, వెంకటరామ్‌శరణ్ 99.87 శాతం, జగత్‌శ్మరణ్ 99.84, ధనుష్ 99.77, అతిధ్యవర్ధన్ 99.62, సుధీర్‌కుమార్ 99.61, ధీరజ్ కుమార్ 99.47, శ్రీలేఖ 99.29, ఉమర్ 98.83, హసాన్ 98.57, అజాన్ 98.83, రోహిత్‌రెడ్డి 98.22 పర్సెంటైల్ సాధించారు. ఉత్తమ పర్సెంటైల్ సాధించిన విద్యార్థులను నారాయణ కళాశాల డీజీఎం రామమోహన్ రెడ్డి, కోర్‌డీన్ చంద్ర కిషోర్‌రెడ్డి, డీన్ బాలవెంకటరెడ్డి, ఏజీఎంలు చెన్నకృష్ణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి అభినందనలు తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ



మార్కులు సాధించిన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: వైవీయూ నవంబర్, డిసెంబర్ నెలలో నిర్వహించిన డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ ఫలితాల్లో కడప స్పిరిట్ విద్యార్థులు ప్రతిభచాటారు. - మొదటి సెమిస్టర్ బికాంలో అర్జియ(8.5), బీఎస్సీలో లక్ష్మిప్రియ (10), బీఏలో ఇస్రామన్హాజ్ (10) గ్రేడ్ పాయింట్స్‌ను సాధించారు. మూడవ సెమిస్టర్ బికాంలో పావని(8.5), బీఎస్సీలో రాజీచరణ్(7.2), బీఏలో సాయిరీతిస్(8.6) గ్రేడ్‌పాయింట్స్ సాధించారు. ఐదో సెమిస్టర్ బికాంలో జోసిప్రనీల్(8.4), బీఎస్సీలో అర్చనజ్యోతి (7.0), బీఏలో బార్గవి(7.8) గ్రేడ్ పాయింట్స్ సాధించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల అధినేత నిర్మల, సంచాలకులు రవీంద్ర, ఉపాధ్యక్షులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ

కడప కల్చరల్ : శ్రీ విజయదుర్గాదేవి ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ఆలయ నిర్వాహకులు సుధా దుర్గాప్రసాద్ దంపతులు సంప్రదాయంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ఆలయ ధ్వజ పీఠం వద్ద ధ్వజస్తంభంపై అమ్మవారి వాహనం సింహం చిత్రం గల పతాకాన్ని ఎగురవేశారు. ప్రసాదం కోసం వచ్చిన మహిళా భక్తులందరికీ అర్చకులు, నిర్వాహకులు కొడిముద్దలను పంచి పెట్టారు. కార్యక్రమాన్ని వేద పండితులు రాయపెద్ది సుబ్బరాయ శర్మ శిష్యబృందం, ఆలయ అర్చకుల వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం యాగశాలలో చండీహోమం, ఆలయ మండపంలో శ్రీచక్రార్చనలు నిర్వహించారు. రాత్రి శ్రీ విజయదుర్గ, మల్లికార్జునస్వామి సింహ వాహనంపై ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

రాహుకాల పూజలు

మంగళవారం కావడంతో ఆలయ ప్రాంగణంలో భక్తులు రాహుకాల పూజలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా భక్తులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థలో నూతన నియామకాలను వెంటనే చేపట్టాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త పిలుపుమేరకు మంగళవారం డివిజన్ కార్యాలయంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎల్ఐసీలో కేవలం ఈ ఆర్థిక సంవత్సరం 9 నెలలలోనే 3,130 మంది క్లాస్, 3, 4 తరగతుల్లో సిబ్బంది తగ్గిందని, పాలసీదారులకు మెరుగైన సేవలందించేందుకు నూతన నియామకాలు తక్షణ అవసరమన్నారు. సంస్థలో నూతన నియామకాలు చాలాకాలంగా జరగడంలేదని, తక్షణం ఈ క్యాడర్లలో రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీలో 86 శాతం మంది సిబ్బందికి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) ప్రాతినిధ్యం వహిస్తోందని, బ్యాంకులలో, సాధారణ బీమా రంగంలో, ఇతర రంగాలలో ఇచ్చినట్టుగా తమ సంఘానికి కూడా గుర్తింపు పునరుద్ధరించాలని అన్నారు. అనంతరం యూనియన్ ప్రతినిధి బృందం పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అక్బర్ బాషా, సుధీకర్, వసుప్రద, అయ్యవారు రెడ్డి, వారిజాతమ్మ, పర్వీన్, పద్మజ పాల్గొన్నారు.



నిరసనలో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

ఉక్కు పరిశ్రమ ఏర్పాటయ్యేవరకు పోరాటం

కడప సెవెన్‌రోడ్స్ : విభజన చట్ట ప్రకారం కడప జిల్లాలో నిర్మించాల్సిన ఉక్కు పరిశ్రమ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేంతవరకు పోరాటం చేస్తూనే ఉంటామని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజు, అఖిలపక్ష కమిటీ నాయకులు నారాయణరెడ్డి, సీఆర్వీ ప్రసాద్ లు తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల దీక్ష మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. దీక్షలో కూర్చున్న జాల జయవర్ధన్ , కోటపాటి సుబ్బమ్మ , అరుణ కుమారి, వసంత్, నరసింహ, శేఖర్ తదితరులకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివి సుందర్ రామ రాజు నిమ్మరసం తాగించి దీక్ష విరమింపచేశారు. ఈ దీక్షకు బహుజన సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సగిలి గురప్ప,ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, సీపీఎం ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ రాము, రెవల్యూషనరీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ , ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొడవటి కంటి నాగరాజు తదితరులు మద్దతు తెలిపారు.



రెండవరోజు దీక్షలో పాల్గొన్న ఆందోళనకారులు

హాకీ బాలికల జట్టు విజయం

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 8 నుండి 10 వరకు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 15వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ హాకీ బాలికల పోటీలు నిర్వహించారని, ఈ పోటీల్లో కడప జిల్లా హాకీ జట్టు అనంతపురం జట్టుపై 2-0 గోల్స్ తో విజయం సాధించింది. ఈ విజయం పట్ల కడప జిల్లా హాకీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవిచంద్ర, అసోసియేషన్ కార్యదర్శి శేఖర్, కోచ్ ఝాన్సీ, మేనేజర్ ఖాదర్ మోయిన్, హాకీ కోచ్ ఖాదర్ బాష, సీనియర్ హాకీ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.



హాకీ పోటీల్లో విజయం సాధించిన కడప బాలికల జట్టు

తనిఖీలు ముమ్మరం



బ్రీత్ అనలైజర్ ద్వారా తనిఖీలు చేస్తున్న కడప ట్రాఫిక్ ఎస్ఐ ప్రతాప్ రెడ్డి

కడప అర్బన్: కడప నగరంలోని ట్రాఫిక్ సీఐ జావేద్ ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి సీఎస్ఐ చర్చి వద్ద విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించారు. మోటార్ సైకిల్, ఆటో డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలను చేశారు. మద్యం సేవించి వాహనాలను నడిపిన వారికి కౌన్సిలింగ్, జరిమానాను సీఐ విధించారు.

ఎస్పీని కలిసిన మహిళా పోలీసులు



ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా పోలీసులు

కడప అర్బన్: జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ వార్డు సెక్రటరీ, మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున మహిళా పోలీసులు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారితో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో కృషి చేయాలని కోరారు.

బీసీ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాదుల్లా

కడప రూరల్: బీసీ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలని నూర్‌బాష్ ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఖాదర్‌బాష, ఉపాధ్యక్షులు బాదుల్లా తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం బీసీల డిక్లరేషన్ హామీలు త్వరితగతిన అమలు చేయాలన్నారు. మైనార్టీ ముస్లింలకు చెప్పిన పథకాలన్నీ వెంటనే అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బాబయ్య, రాజకులాయప్ప, సిద్దయ్య, బాష పాల్గొన్నారు.

దళితులకు అన్యాయం

కడప రూరల్: పాలతల దేవస్థానంలో ఉపాధి పొందుతున్న దళితులకు అన్యాయం జరుగుతోందని చింతకొమ్మదిన్నె మండలం గంగనపల్లె గ్రామానికి చెందిన ఎస్సీలు పెద్ద ఓబయ్య, హరిక్రిష్ణ ఆరోపించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో పెద్ద ఓబయ్య మాట్లాడుతూ 30 ఏళ్లుగా దేవస్థానంలో స్వీపర్‌గా , మామిడి తోరణాలు కడుతూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అందుకు గాను దేవస్థానం వారు తనకు ఒక నెలకు రూ 1500 ఇచ్చేవారని అన్నారు. ప్రస్తుతం ఉన్న దేవస్థానం అధికారి ఎస్సీ కులానికి చెందిన వాడివి తోరణాలు కట్టకూడదని తనను తొలగించారని ఆరోపించారు. హరిక్రిష్ణ మాట్లాడుతూ కొన్నేళ్లుగా అక్కడ షాపును నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు. ఇటీవల పూజా సామాగ్రి కొనుగోలుకు సంబంధించి టెండర్లు వేశారని, అందులో తనను పాల్గొనకుండా అక్కడి అధికారి అడ్డుతగిలారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఘనంగా జాతీయ యునాని దినోత్సవం

కడప కల్చరల్ : కడప నగరంలోని అల్మాస్‌పేటలోగల జామియతుస్సాలిహాత్ మద్రస అడిటోరియం హాలులో జాతీయ యునాని దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం యునాని అవగాహన సదస్సును నిర్వహించారు. కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎఫ్ ఎం ముక్తార్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయుష్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంశేఖర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యునాని వైద్యం మిగతా వాటిలాగానే ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న ప్రభుత్వ హోమియోపతి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనందరావు, ప్రభుత్వ హోమియోపతి కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాంబమూర్తి తన సందేశంలో యునాని వైద్య సేవలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ యూనియన్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ డాక్టర్ ఎస్ఎండీ హయత్, డాక్టర్ సయ్యదా నసీమున్నీసా, కర్నూల్ డాక్టర్ అబ్దుల్ హక్ యునాని మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ రెహమాన్ సిద్దికి, కర్నూల్ నుండి డాక్టర్లు జమాలుద్దీన్, ఖాదిరి, మజీజ్, రజాక్, నయిబుర్ రెహమాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆయుష్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శేఖర్‌రాజు

ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని యూటీఎఫ్ కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు ఆరోపించారు. మంగళవారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలను ఇచ్చిందన్నారు. వెంటనే ఆ హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్టారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గోపినాథ్, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ / కడప ఎడ్యుకేషన్ : తమ బిడ్డలను కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహిళా పోలీస్ స్టేషన్ కడప యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ ఈదురు బాష పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ సంస్థతో కలిసి విద్యార్థినిలకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, బాలలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ ఈదురుబాష మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. యుక్త వయస్సులో ఎటువంటి ఆకర్షణలకు , ప్రలోభాలకు లోనుకాకూడదని, అదేవిధంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సమాజంపైన అవగాహనతో ముందుకు సాగాలన్నారు.

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శాంత మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో కౌమార దశలో ఉన్న పిల్లలు ప్రతి విషయంలో ఆకర్షితులవుతూ ఉంటారని, ఇటువంటి తరుణంలో జాగ్రత్తగా నడుచుకోవడంతోపాటు మంచి చెడుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అలాగే సోషల్ మీడియా, సైబర్ కాల్స్, ఫ్రాడ్ కాల్స్ వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఈదురుబాష